## పార్టీ మారకపోతే బెదిరింపులా?

**-కార్పొరేటర్ పోచయ్య**

**బోడుప్పల్, జులై 1 (ప్రభాతవార్త):** రాజకీయంగా ఎదుర్కోలేక తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పీర్జాదిగూడ నగరపాలక సంస్థ 20 డివిజన్ కార్పోరేటర్ కౌడె పోచయ్య అన్నారు. సోమవారం ఉదయం ఆయన పీర్జాదిగూడలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్థానిక నాయకులు కొందరు తనను పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ మారకపోతే తనను వ్యాపార పరంగా నష్టం చేసే చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. పర్వతాపూర్ సాలార్‌జంగ్ కంచ సర్వే నెం.1లో ప్లాట్లను ప్రభుత్వ అధికారులు రిజిస్ట్రేషన్ చేసి, ఎన్‌ఒసి ఇచ్చి, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు చేసి కార్పోరేషన్ అధికారులు ఇంటి నిర్మాణ అనుతులు ఇచ్చిన తర్వాత ప్రస్తుతం నిర్మాణ పనులు చేపడుతుంటే కూల్చివేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవిన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి కూల్చివేతలకు సిద్ధమవుతున్నారని అన్నారు. తాను రాజకీయంగా, వ్యాపార పరంగా ఎలాంటి తప్పు చేయలేదని అన్నారు. వారు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా లొంగబోనని స్పష్టం చేశారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## పురుగుల మందు సేవించి బాలుడి ఆత్మహత్య

**కొడంగల్,జూలై 1ప్రభాతవార్త**

అనారోగ్య బాధ తట్టుకోలేక బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.సంఘటనకు సంభందించి హెడ్‌కానిస్టేబుల్ శివ రాములుగౌడ్ కథనం మేరకు..గుండ్లకుంట గ్రామానికి చెందిన పెద్ద భీములు కుమారుడు వెంకటేష్ (16)గత ఆరు నెలల నుంచి సుద్దకట్టు వ్యాధితో బాధపడుతున్నాడు.హైద్రాబాద్‌లో వ్యాధికి చికిత్స నిర్వహించుకున్నాడని,కానీ మూత్ర విసర్జన సమయంలో అతిగా మంటతో బాధపడుతున్నట్లు మృతుడి తల్లిదండ్రులు పేర్కొనట్లు తెలిపారు.సోమవారం ఉదయం పొలానికి వెళ్ళి క్రిమి సంహారక మందును తాగి,ఇంటికి తిరిగి వచ్చి తల్లిదండ్రులకు మందు తాగినట్లు తెలుపడంతో వెంటనే కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.మృతుడి తండ్రి పెద్ద భీములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజల నుంచి ధరఖాస్తులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజవాణిలో ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కె.శశాంక, తదితరులు.

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 178 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో 178 అర్జీలకు గాను దరణి ,రెవిన్యూ శాఖకు సంబంధించినవి రాగా,పెన్షన్, భూ సర్వే,శిశు సంక్షేమ శాఖ ఇతర శాఖలకు సంబంధించినవి వచ్చాయని వాటిని సంబంధిత అధికారులకు ఎంపి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ,ఆర్‌డిఓ వాసుచంద్ర జడ్పిసిఇఓ సుధీర్ కుమార్,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లాలో...

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి(70 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ శశాంకతో పాటు అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, డీఆర్‌వో సంగీతలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పోర్టల్‌లో అప్లోడ్ చేసి, తదనంతరం పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పంపించడం జరుగుతుందని, అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట, వెంట పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టడం చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు.ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటిలో ఎన్ని పరిష్కరించడం జరిగిందని, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తుందని తెలిపారు.ప్రజావాణి వచ్చేటప్పుడు రిజిస్టర్ తీసుకుని రావాలని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10:30 గంటలకు జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ అధికారులందరు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మేడ్చల్ జిల్లాలో...

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 1, ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమాల్లో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి 114ధరఖాస్తులను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన, అదే విధంగ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ధరఖాస్తులను కూడ పరిశీలించి వాటిని కూడ పరిష్కరించాలని అన్నారు. మీ పరిధిలో ఉన్న పెండింగ్‌లో ఉండి పరిష్కరించలేని ధరఖాస్తులు ఉంటే వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ జరిపి ఆన్‌లైన్ ధరఖాస్తుదారులకు వివరణ ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే

**- ప్రభుత్వ భూములను కాపాడాలని మంత్రికి వినతి**



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

**షాద్‌నగర్, జూలై 1, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూములను తిరిగి సర్వేచేసి నిజమైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం సంబంధిత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను తిరిగి సర్వే చేసి నిజమైన ప్రభుత్వ భూములను నిర్ధారించి ఆ భూములను ప్రజలకు ఉపయోగపడేవిధంగా చూడాలని మంత్రిని కోరడం జరిగిందని అన్నారు. సిద్దాపర్ పరిసర ప్రాంతాల్లో దారిద్రరేఖ దిగువన ఉండి జీవిస్తున్న పేద ప్రజలు చాలా మంది ఉన్నారని వారికి గత 15 సంవత్సరాల కాలంగా ఇళ్ల స్థలాలను కేటాయించలేదని ఈ ప్రభుత్వ భూమిలో 15 నుంచి 20 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలకు, ఆట స్థలానికి కేటాయించాలని కోరడం జరిగిందని దీనికి స్పందించిన మంత్రి వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి సిద్దాపూర్ ప్రభుత్వ భూములను వెంటనే సర్వే చేసి జరిగిన అన్యాయాలను తెలుసుకొని వారికి న్యాయం జరిగేటట్లు చూడాలని ఆయన ఆదేశించారని అన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నేతలు తదితరులు ఉన్నారు.

## పకడ్బందీగా నూతన చట్టాల అమలుకు చర్యలు

**- జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

**- తాండూరు పోలీస్టేషన్‌ను ఆకస్మికంగా**

**- సందర్శించిన జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి**



తాండూరు పోలీస్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

**తాండూరు, జూలై 1, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందకు చర్యలు తీసుకుంటామని వికారాబాద్ జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి అన్నారు. జిల్లా నూతన ఎస్పీగా బాద్యతలు చేపట్టిన తరువాత మొదటి సారీ తాండూరు పోలీస్టేషన్‌ను ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డితో కలిసి పోలీస్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో వసతులు, శాంతి భద్రతల పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్టేషన్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 14బృందాలలో సుమారు 600 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ చట్టాలతో గాయాలు ఉన్న కేసుల్లో సత్వర చర్యలు ఉంటాయని, నిబంధనల ప్రకారం మిగతా వారికి వెసులుబాటులు ఉంటాయని స్పష్టం చేశారు. అదేవిదంగా జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిఘా పెంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కాశీనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చొరవ చూపాలి





కందుకూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి, ఎంపిడిఓ

**కందుకూరు, జులై 1, ప్రభాతవార్త:**

ప్రజాపాలన ద్వారా గ్రామాలలో ప్రజలనుండి తీసుకున్న దరకాస్తుల ద్వారా ప్రజలకు లబ్ధిచేకూరేలా అధికారులు చొరవచూపాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ముక్తఖంఠంతో అధికారులకు విన్నవించారు. కందుకూరు మండల సర్వసభ్యసమావేశం సోమవారం ఎంపిపి మంద జ్యోతిపాండు అద్యక్షతన మండల సమావేశ ప్రాంగణంలో జరిగింది. ఉదయం 11 గంటలు ప్రారంభమైన ఈ సమావేశానికి ఎంపిటిసిలు అధికారులు హాజరైనారు. అంశాలవారిగా సాగిన ఈ సమావేశంలో సభ్యులు మాట్లాడుతు పేదవాడి సంక్షేమానికి మహలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు లబ్దిదారుల ఎంపిక కోసం రెండు నెలలక్రితం ప్రజలనుండి దరకాస్తులు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే చాలామంది పేదలకు ఈ పథకాలు అమలు కావడం లేదని మల్లి మండల కార్యాలయంలో దరకాస్తు చేసుకుంటే లబ్ది చేకూరుతుందని ప్రభుత్వం ప్రకటిచడం జరిగిందన్నారు. గతంలో దరకాస్తు చేసుకున్నవారు మల్లి మండల కార్యాలయానికి వెల్లి దరకాస్తు పరిశీలన చేయమంటే అన్‌లైన్ లో నీపేరు ఉంటేనే అప్‌లోడ్ చేస్తామని పంపుతున్నారని దరకాస్తు చేసుకున్న వారి దరకాస్తుఅన్‌లైన్ చేయవలసిన బాద్యత అధికారులదేకదా అని సభ్యులు ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాన్ని అర్హులైన వారందరికి అందేలా చూడాలని మండలంలో నడుస్తున్న నమోదు కేంద్రానికి గ్రామాల వారిగా ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సభ్యులు డిమాండ్‌చేశారు. అదేవిదంగా గ్రామాల వారిగా నడుస్తున్న ఎక్సైజ్ బెల్టుశాపులను నియంత్రించి పేద ప్రజల అరోగ్యాన్ని కాపాడాలన్నారు. పంటల సాగుకాలం ప్రారంభమైనందునరైతులకు వెంటనే రైతు బందు పథకం అందేలా చొరవచూపాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులు అర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రజలకు సేవలు అందించడానికి మండల పరిదిలోని మీర్ఖాన్‌పేట, లేమూరు, పులిమామిడి గ్రామాలలో మీసేవా కేంద్రాల ఏర్పాటుకు అంకాశం ఉన్నదని ఈ అంకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం కవిత సూచించారు.మండలంలోని అయా గ్రామాలలో ఉన్న విద్యుత్ లూప్‌లైన్‌లను నియంత్రించాలని విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని సభ్యులు సూచించారు. అటవీ ప్రాంతానికి చేరువలోఉన్న గ్రామాల పశువులను, మేకలను అయూ అడవిలో మేపుకోవ డానికిఅవకాశం కల్పించాలని ఎంపిటిసి యాదయ్య డిమాండ్ చేశారు. మండల పరిదిలోని మీర్ఖాన్‌పేట పరిదిలో నిర్మానంలో ఉన్నపార్మారోడ్డును వెంటనే పూర్తిచేయాలని సభ్యులు కాకి రాములు అధికారులను కోరారు. ఈ విషయాలపైన ఎంపిడిఓ స్పందిస్తు సభ్యుల సూచనలు సలహాలను అయా శాఖల అధికారులు పరిఘనలోకి తీసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలుతీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న దరాకస్తుల సేకరణ కేంద్రాన్ని గ్రామాల వారిగా నిర్వహించేపరిస్తితులు ప్రస్తుతం లేవని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెల్లడం జరుగుతుందన్నారు. మండల సమావేశానికి గైరాజరైన అయా శాఖల వారిపై ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. ఎంపిటిసిల పదవీకాలం ముగియనున్నందున ఈనెల 4 వ తేదీన వారికి వీడ్కోలు సమావేశాన్ని మండలం తరపున ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సమావేశానికి అధికారులు ప్రజా ప్రతినిదులు హాజరై వారికి వీడ్కోలు చెప్పాలని ఎంపిడిఓ కోరారు. ఇప్పటికే గ్రామాలలో సర్పంచుల పదవీకాలం ముగిసిందని, నేడు ఎంపిటిసిల పదవీకాలం ముగుస్తుందని ఇకనుండి ప్రజా ప్రతినిదులుగా పనిచేసినవారు అధికారులకు సహకరించి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి జి శమంత ప్రభాకర్‌రెడ్డి, పిఎసిఎస్ చేర్మెన్ చంద్రశేఖర్, ఎంపిటిసిలు, ఇందిరా దేవేందర్, జ్యోతి నర్సింహ్మారెడ్డి, లక్ష్మి దేవేందర్‌రెడ్డి, పద్మపాండు, రాజమ్మ, రాజశేఖర్‌రెడ్డి, సురేష్, యెల్లారెడ్డి, నర్సింహ్మ, కాకిరాములు, యాదయ్య, లలిత తోపాటు అయా శాఖల అదికారులు పాల్గొన్నారు.

**-కందుకూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసిల డిమాండ్**

**-గ్రామాలలో సమస్యల పరిష్కారానికి స్పెషల్ అఫీసర్‌లు ప్రత్యేక చొరవ చూపాలి**

## భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

**-ఉద్యోగం,నగదుతో పాటు ఇంటి స్థలం కేటాయింపు**

**-ఆర్డీఓ శ్రీనివాస్,కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి**



రైతులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి,ఆర్డీఓ శ్రీనివాస్‌రావ్

**కొడంగల్,జూలై 1ప్రభాతవార్త**

కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులోని 19 సర్వే నెంబర్ రైతులు ఆందోళన చెందవద్దని,భూ నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటూ మంచి ప్రయోజనాలను అందించనుందని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు,కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలు రైతులకు భరోసా కల్పించారు.సోమవారం స్దానిక తహశీల్దార్ కార్యాలయంలో మెడికల్ కళాశాల,వెటర్నరీ కళాశాలల ఏర్పాటుకు సర్వే నం.19లో భూ సేకరణ నిమిత్తం రైతులకు ప్రత్యేక సమావేశాని ్న ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రైతులతో అధికారులు నేరుగా మాట్లాడుతు వారి అభిప్రాయాలను సేకరిచండంతో పాటు ప్రభుత్వం అందించే సౌకర్యాలను వివరించారు.మెడికల్,వెటర్నరీ కళాశాలల ఏర్పాటుకు మొత్తంగా 60 ఎకరాల స్దలం అవసరముందని,అందుకు అనువైన సర్వే నెంబర్ 19లో మొత్తంగా 74 ఎకరాల్లో రైతుల సమన్వయంతో 60 ఎకరాల స్దల సేకరణకు అభిప్రాయాలు,రైతుల అనుమతి తీసుకునేందుకు గాను సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రైతులు తమతమ అభిప్రాయాలను అధికారులకు తెలిపారు.అదేవిధంగా అధికారులు మాట్లాడుతు అభివృద్ధి పనులకు గాను స్దలాన్ని అందించే రైతులకు ప్రబుత్వం అండగా నిలుస్తుందన్నారు.భూ సేకరణలో భూములు కోల్పోయే వారికి ఎకరాకు రూ.10లక్షల నగదుతో పాటు ఉద్యోగం,డీటీసీపీ లేఔట్‌తో కూడిన ఇంటి స్దలం అందిచ్చేఏందుకు ప్రభుత్వం సిద్దంగా ఉన్నట్లు తెలిపారు.కాబట్టి రైతులు ఎటువంటి ఆందోళన,అనుమానం చెందాల్సిన అవసరం లేదని,అభివృద్ధికి సహకరించాలని కోరారు.సమావేశంలో తహశీల్దార్ విజయ్‌కుమార్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

## నాలా ఆక్రమణలను తొలగించాల్సిందే .!

**- చిలుక వాగు అభివృద్ధికి రూ. 16కోట్లు**

**- వరద ఇబ్బందులకు యాక్షన్ ప్లాన్**

**- అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమీక్ష**

**తాండూరు, జూలై 1, ప్రభాతవార్త :** నాలా ఆక్రమణలను తొలగించల్సిందే అని తాండూరు ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి అన్నారు. చిలుక వాగు అభివృద్ధికి రూ.16కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలకు వరద ఇబ్బందులు లేకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందని అన్నారు. సోమవారం తాండూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, తాండూరు డిఎస్పీ బాలక్రిష్ణారెడ్డితో పాటు రెవెన్యూ, ఆర్‌ఆండ్‌బి తదితర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలం అప్రమత్తత, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆదివారం కురిసిన వర్షానికి పట్టణంలోని వార్డులలో వరద నీరు ప్రవహించడంపై ఎమ్మెల్యే దృష్టి సారించారు. ఇకపై అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తాండూరులో గత 20ఏళ్ల క్రిందట ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థతో వరద ఇబ్బందులు వచ్చాయని అన్నారు. దీనికి తోడు నాలాల కబ్జాకు గురికావడం మరింత ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. తాండూరులో వరద నీటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నాలాల ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. కబ్జాలను ప్రక్షాళన చేసేందకు పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహాకరించాలని కోరారు. ఆక్రమణల తొలగింపులో ఎలాంటి ఒత్తిడిలకు లొంగేది లేదని, ప్రజల సంక్షేమమే ముఖ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యాచారం మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే హాస్టల్ తనిఖీ



**యాచారం జూలై1,ప్రభాతవార్త :** వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రిన్సిపాల్‌కు ఎంపిపి సుకన్య భాష సూచన చేశారు.సోమవారం మండల కార్యాలయానికి సమీపంలో ఉన్న మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే హాస్టల్‌ను యాచారం ఎంపిపి కొప్పు సుకన్య భాష ,ఎంపిడివో నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆకస్మాత్తుగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ....విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కోరారు.హాస్టల్లో భోజనం మౌలిక సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.వసతిగృహాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల దుస్తులు ఉతికిన తర్వాత హాస్టల్ భవనం గోడకు ఆరేయడం విషయం తప్పుపట్టారు.పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి ఎంపిపి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై పోరాడదాం....

**-భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా గడిగె గజేందర్‌గౌడ్**

**షాబాద్, జూలై 1, ప్రభాతవార్త :**

రైతులందరు సంఘటితమై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడదామని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్‌లో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం మండల అధ్యక్షునిగా దండు యాదవరెడ్డి, కార్యదర్శిగా దోనూరి కృష్ణ, కోశాధికారిగా కలాల్ చంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా వడ్ల వీరేశం, బొమ్మల దేవి, మల్లేష్, పర్వేద శ్రీశైలం, బూర్గుల కృష్ణ, దోనూరి చంద్రశేఖర్, గొల్లపల్లి నర్సింహ్మారెడ్డి, పాలమాకుల పాండు, బీర్ల చెన్నయ్య, బేగరి వినోద, జీవాల బుగ్గయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

కడ్తాల్,జులై 01 ప్రభాతవార్త : కడ్తాల్ మండల పరిధిలోని గోవిందాపల్లి తండా దగ్గర 765 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి 10 గం.లకు చోటు చేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని వయస్సు 45 సంవత్సరాల వరకు ఉంటుందని మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తుపడితే 8333993536, 9493628100 నంబర్లకు సమాచారం అందించాలని కడ్తాల్ సిఐ శివప్రసాద్ తెలిపారు.

# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బస్సులో ప్రయాణం

**-ప్రయాణికుల సౌలభ్యమే ప్రభుత్వ లక్ష్యం**

**కొత్తూర్, జూలై 1, ప్రభాతవార్త :**

నిరుపేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు నిత్యం రవాణా సదుపాయాన్ని కల్పించే ఆర్టీసీ బస్సులు ప్రజల సౌకర్యాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎతున్న సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. షాద్‌నగర్ పట్టణం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నూతనంగా 9ఆర్టీసీ బస్సులను సోమవారం ఆయన ప్రారంభించారు. అందులో ఒకటి కొత్తూర్ మీదుగా తిమ్మాపూర్, ఫాతిమాపూర్, తీగాపూర్, చేగూర్ వరకు నూతన బస్సులు ఏర్పాటు చేశారు. అదే బస్సులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రయాణికులతో కలిసి టికెట్ తీసుకుని ప్రయాణించారు. వీరికి కొత్తూర్ పురపాలికలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు భారీగా స్వాగతం పలికారు. తీగాపూర్‌లో కొత్తూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా షాద్‌నగర్ నుండి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిత్యం పనుల మీద వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, కూలీలు అదేవిధంగా చదువుల కోసం వెళ్లే విద్యార్థుల సౌలభ్యం కోసం అన్ని రూట్లలలో బస్సులు నడిపేలా తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.గతంలో షాద్‌నగర్ నుండి కొత్తూర్, తిమ్మాపూర్, ఫాతిమాపూర్ మీదుగా చేగూర్‌కు బస్సు సౌకర్యం ఉండేది, అసౌకర్యం గత పది సంవత్సరాలుగా నిలిపివేశారు.దీంతో గ్రామస్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత వెంటనే తిరిగి అదే రూట్లో బస్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు షాద్‌నగర్ నుండి ఉదయం 8గంటలకు ఒకసారి సాయంత్రం మూడు గంటలకు ఒకసారి రెండు ట్రిపులు నిర్వహిస్తుందఎని తెలిపారు. ఈ రూట్లలో ప్రజలు అధికంగా ప్రయాణిస్తే మరిన్ని ట్రిప్పులు బస్సు తిరిగింది కృషి చేస్తామన్నారు. సామాన్యులకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొత్తూర్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవవేందర్‌ముదిరాజ్, జె.గోవర్ధన్‌గౌడ్, కె.సురేందర్, మాజీ సర్పంచ్ జగన్,బాలు నాయక్, ఆంజనేయులునాయక్, రాజశేఖర్‌రెడ్డి, వి.నరసింహముదిరాజ్, హసన్, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

